క్లుప్తంగా

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



నర్సంపేట : ఖానాపురం మండలంలోని బుధరావుపేటకు చెందిన అనపర్తి సంజీవ ఫిబ్రవరిలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంజీవ మృతి బాధాకరమన్నారు. విద్యుత్ శాఖ అధికారులు బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడంలో చొరవ చూపడాన్ని అభినందించారు.

శాశ్వత డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శాశ్వత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ధర్మసమాజ్ పార్టీ, అనుబంధ స్టూడెంట్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేడ్కర్ సెంటర్ వద్ద శుక్రవారం ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలు ఉంటేనే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాదిల సాయిబాబా, జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, నాయకులు మురళీకృష్ణ, సునీల్, వెంకటస్వామి, శివకృష్ణ, శ్రీనివాస్, విష్ణు, రంజిత్, గణేష్, శ్రీకాంత్, స్వామి, సదానందం, సాయి తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌లో తాజా కూరగాయలు



గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లో పండిస్తున్న తాజా కూరగాయలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న పలు రకాల తాజా కూరగాయలు విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా ఉపకరిస్తున్నాయని ప్రధానోపాధ్యాయుడు పట్టాభి, గార్డెన్ ఇన్‌చార్జ్ సబిత విలేకరులకు తెలిపారు. కోసిన కూరగాయలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తున్నట్టు వారు విలేకరులకు శుక్రవారం వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోత్స్న ప్రభ, వెంకట్‌రావు పాల్గొన్నారు.

సన్మానం



ఖానాపురం : ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన స్థానిక ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం ఆరీఫ్ హుస్సేన్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు భూమ రాజేందర్‌లను బుధరావుపేట హైస్కూల్‌లో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, ఆర్‌పీలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

ఫ్లెక్సీలు కట్టకుండా తీర్మానం

సంగెం : మండల కేంద్రంలో ఇకపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదంటూ వివిధ పార్టీల నాయకులు తీర్మానం చేశారు. మండల కేంద్రంలో ఇటీవల ప్రతిపక్ష పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై వివాదం చెలరేగిన క్రమంలో అధికార పార్టీ నేతలు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు హాజరై విమర్శలు చేసుకున్నారు. వాదోపవాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణల అనంతరం ఇక నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీలు కట్టకూడదని తీర్మానం చేశారు. సభలో పంచాయతీ కార్యదర్శి రవీందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ట్రస్ట్ భూములను కాపాడుకుంటాం

రాయపర్తి : సుమారు 23 ఏళ్ల క్రితం ఓ దాత ఓ ట్రస్ట్‌కు ఇచ్చిన భూములను కాపాడుకుంటామని మండలంలోని మొరిపిరాల, కిష్టాపురం, పన్యానాయక్‌తండా గ్రామాల ప్రజలు తెలిపారు. సదరు భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సదరు భూమిలో పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉండగా ట్రస్ట్‌కు చెందిన కొందరు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

శుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం



వర్ధన్నపేట : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు

వర్ధన్నపేట : పల్లెల్లో, పట్టణాల్లో ప్రతిఒక్కరూ శుభ్రత పాటిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని ఎంపీడీఓ గంట వెంకటరమణ తెలిపారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇల్లందలోని ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణ చర్యలు, పారిశుద్ధ్య నిర్మూలనపై మహిళ స్వయం సహాయక సంఘాలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలతో కలిసి శ్రమదానం చేశారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు, పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ మానవహారాన్ని నిర్మించి ప్రతిజ్ఞ చేయించారు. జీపీ నుంచి వరంగల్–ఖమ్మం రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలు, రెండు గుంతల మరుగుదొడ్డి ఉపయోగంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేశ్, ఏటీఎం వేణు, ఏపీఓ నాగేశ్వర్‌రావు, ఎంఎస్ అధ్యక్షురాలు అరుణ, సీసీ గోలి కొమురయ్య, ఈసీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి వెంకటస్వామి మాట్లాడారు. మండల కేంద్రంలో కారోబార్ కరుణాకర్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఎం కృష్ణమూర్తి, వైద్యురాలు నవ్యకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సరిత, అంబేడ్కర్ యూత్ ప్రెసిడెంట్ జిల్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని పలు గ్రామాల్లో పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల వారీగా ఆశకార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను తొలగింపజేశారు. జ్వర సర్వే నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దేవేందర్, సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని ఎంజేపీ గురుకుల విద్యాలయంలో మానవహారం నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేకంగా ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ మల్లయ్య, ఏపీఎం రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని కొండాయిల్‌పల్లిలో ప్రజలకు పంచాయతీ కార్యదర్శి రజిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పిన్నింటి రజిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్, ఉప్పరపల్లి, చెన్నారావుపేట, తిమ్మరాయినిపహాడ్‌ల్లో ఆయా గ్రామ సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అమీనాబాద్‌లో ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడారు. కార్యక్రమాలలో ఏపీఎం ఈశ్వర్, ఏపీఓ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కృష్ణానగర్‌లో నిర్వహించిన సదస్సులో ఎంపీడీఓ కాసర్ల రవీందర్ మాట్లాడారు. ప్రతిజ్ఞ చేయించారు. గుంటూరుపల్లి ప్రైమరీ స్కూల్‌లో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు ఖలీల్, సరిత, మేరా యువ భారత్ వాలంటీర్లు వెల్లండ సురేశ్, గాలి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్‌నాయక్ మాట్లాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ సరిత, వైస్‌ప్రిన్సిపాల్ లీల, కారోబార్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు మృతికి బాధ్యత వహించాలి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : గిరిజన మహిళా కౌలు రైతు మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి, ఆమె కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. నర్సంపేటలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజుపేట గ్రామ శివారు గార్లగడ్డతండా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన మహిళా రైతు పాల్తియా భద్రమ్మ అదేగ్రామానికి చెందిన నూనె సదయ్య వద్ద ఏడు ఎకరాల భూమిని కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తోందని, ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయాయని తెలిపారు. పెట్టుబడిగా తెచ్చిన అప్పులు పెరగడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. పంట నష్టంపై అధికారులు సర్వేలు చేసి రైతులకు మనోధైర్యాన్ని కల్పించి ఉంటే భద్రమ్మ ఆత్మహత్య ఆగి ఉండేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లిస్తామని భరోసా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కౌలు రైతుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటనలు విరుద్ధంగా ఉన్నాయన్నారు.

అవగాహనతోనే ఓజోన్ పొర పరిరక్షణ



బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

నర్సంపేట : అవగాహన పెంచుకోవడం ద్వారానే ఓజోన్ పొర పరిరక్షణకు పాటుపడగలమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ఓజోన్ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని ఆ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. ఓజోన్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మానవాళిని సూర్యరశ్మి ద్వారా వెలువడే అతినిలలోహిత కిరణాల నుంచి రక్షించే తీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓజోన్ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బైరి సత్యనారాయణ, సమన్వయకర్త కందాల సత్యనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, స్టాఫ్ సెక్రటరీ సోమయ్య, అధ్యాపకులు భద్రు భూక్యా, రహీముద్దీన్, రాంబాబు, సంధ్య, గాయత్రి, రజిత, పూర్ణచందర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచాలి



వినతిపత్రం ఇస్తున్న సారయ్య, తదితరులు

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 20 నుంచి 42 శాతానికి పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జ్, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు సోల్తి సారయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓకు శుక్రవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సారయ్య మాట్లాడారు. బీసీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, తదితర అన్ని రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనానికి గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా కులగణన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలాలు నరేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాంబరాజు మల్లేశ్, బీసీ ఐక్యవేదిక నాయకులు పంజాల వెంకట్, నాయకులు గుణగాని రవీందర్, సురేశ్, రాజేశ్, శ్రీధర్, శ్రీనివాస్, యాకయ్య, సిద్ధార్థ, ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ప్రవేశపెట్టాలి

పర్వతగిరి : రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ప్రవేశపెట్టాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) రాష్ట్ర ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ప్రజాసంఘాల నాయకుడు మామిళ్ల చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సయ్య వినతిపత్రాన్ని మీడియాకు ప్రదర్శించి మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన పేద కుటుంబాలు ఎక్కువగా వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

వర్ధన్నపేట : మండలంలోని కోనాపురంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ శాఖ ఏఈకి తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు ఆకుల మనోజ్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో గుంజలకు సర్వీస్ వైర్ కడుతున్నారని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అజయ్, అశోక్, నరేందర్, ప్రదీప్, యాకయ్య, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



వర్ధన్నపేట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ వెంకటరమణకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, సురేశ్ మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బందికి జీతాలు, తదితర పనులు ఇబ్బంది ఎదురవుతోందని తెలిపారు. ఐఎఫ్‌ఎంఎస్ ద్వారా జారీ చేసిన చెక్కులు 10 నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే గ్రామ పంచాయతీకి దుకాణాదారులు సైతం క్రెడిట్ ద్వారా సామగ్రి ఇవ్వడం లేదన్నారు. స్వచ్ఛతా హి సేవ, స్వచ్ఛదనం–పచ్చదనం, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు నిధులు రాకపోతే పరిస్థితి మరింత ఇబ్బందికరమవుతుందని తెలిపారు.

రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిషన్, ఎంపీఓ కూచన ప్రకాశ్‌లకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. సమస్యలను వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



ఖానాపురం : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు చదువుకోవాలని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఆయన స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు మెటీరియల్ దోహదపడుతుందని చెప్పారు. ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధిస్తే పాఠశాల అభివృద్ధి కోసం తాను రూ.50 వేల సాయం అందజేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించాలని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ప్రభుత్వ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ చరణ్‌సింగ్, హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు సోమలక్ష్మి, రవికుమార్, శశికుమార్, శ్రీనివాస్, సరిత, నాయుడు, రామ్మోహన్‌రావు, పూర్వవిద్యార్థులు చిరంజీవి, రంగారెడ్డి, రాములు, సీఆర్‌పీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సరికాదు'



నల్లబెల్లి : హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరికాదని ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజాకవి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణకు చేసిన సేవలు చిరస్మరణీయమే అయినా ఆయన పేరు వేరే ప్రాజెక్టుకు పెట్టాలని సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయ పేరు మార్పు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు, నాయకులు మురికి మనోహర్, గంగిశెట్టి నాగభూషణ్, మురికి రవీందర్, పురాం భద్రీనాథ్, గంగిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాపన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

సంగెం : సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కోసం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకుడు జనగాం రమేశ్, గుల్లపల్లి ఉమేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథం, మల్లేశం, కక్కెర్ల శరత్‌బాబు, దుడ్డె భాస్కర్, కోడూరి వెంకట్, ఆగపాటి రాజశేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

రాయపర్తి : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్‌రావు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా ఆయనను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పురుషోత్తమరావు, మాదారపు అశోక్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి..

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని లచ్చినాయక్ తండాకు చెందిన బోడ అంబాలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ శుక్రవారం పరామర్శించారు. తొలుత అంబాలి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ పావని రమేశ్, నాయకులు వీరూనాయక్, సురేశ్, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో నాణ్యత కీలకం



నెక్కొండ : మాట్లాడుతున్న ఏఎంఓ సుజన్‌తేజ



రాయపర్తి : మాట్లాడుతున్న డీసీఈబీ సెక్రటరీ

నెక్కొండ/సంగెం/పర్వతగిరి : విద్యాబోధనలో నాణ్యత కీలకమని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) ఉండ్రాతి సుజన్ తేజ స్పష్టం చేశారు. నెక్కొండ, సంగెం, పర్వతగిరి మండల కేంద్రాల్లో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాం అమలు చేస్తూ విద్యార్థుల అభివృద్ధిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులను నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పరీక్షలకు సన్నద్ధం చేయాలని చెప్పారు. సమావేశాల్లో స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఏవీఆర్.చార్యులు, ఎంఈఓలు రత్నమాల, చదువుల సత్యనారాయణ, ఎంఎన్ఓలు రవికుమార్, నర్సింహాచార్యులు, హెడ్‌మాస్టర్లు రంగారావు, రేణుక, ఆక రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే ఆసక్తి పెంచాలి

రాయపర్తి : మండలంలోని మైలారం కాంప్లెక్స్‌లో పీఎస్, యూపీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించగా డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మక విధానంలో విద్యాబోధన చేపడితే విద్యార్థులకు విషయం మనసులో ఉండిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అజ్మీరా ఉమాదేవి, మండల నోడల్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే బాలల ఎదుగుదల



చెన్నారావుపేట : మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ

చెన్నారావుపేట : బాలల ఎదుగుదలలో పౌష్టికాహారం ప్రధానమని సీడీపీఓ మధురిమ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించాలని చెప్పారు. ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడుతూ పిల్లలకు మినరల్స్‌తో కూడిన ఆహారం అందించాలని సూచించారు. డాక్టర్ సరోజ మాట్లాడుతూ ఐదేళ్లలోపు బాలల్లో తక్కువ బరువు ఉండడంతోపాటు ఎదుగుదల లేని వారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలని చెప్పారు. సమావేశంలో ఏసీడీపీఓలు శ్రీదేవి, హేమలత, సీహెచ్‌ఓ భద్రయ్య, ఎంపీఓ శ్రీధర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రేమలత, సువార్త, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధ, పారిజాతం, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం.. అన్నప్రాసన

దుగ్గొండి : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అరుంధతి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులకు వివిధ రకాల పిండి వంటలు, పూలు, గాజులు అందించి మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా పుడతారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తల్లులతో సమావేశం

నర్సంపేట : పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లులతో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు. పోషణతోనే గర్భిణులు, బాలింతలు, బాలల్లో శారీరక, మానసిక వికాసం సాధ్యమని చెప్పారు. పోషక విలువల కలిగిన ఆహారంపై అవగాహన కల్పించారు. పెరట్లో పెంచే కూరగాయలు, ఆకు కూరల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ బాలామృతం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శిరీష, రాధ, పద్మ, సునీత, కొమురమ్మ, ఏఎన్ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో సొసైటీ అభివృద్ధి

● చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

చెన్నారావుపేట : సభ్యుల సహకారంతోనే సొసైటీ అభివృద్ధి సాధ్యమని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో 67వ వార్షిక మహాసభ శుక్రవారం నిర్వహించారు. సీఈఓ చిట్టి రవి నివేదిక చదువుతుండగా కొందరు సభ్యులు అభ్యంతరం తెలిపారు. కోరం లేకుండా మహాసభ నిర్వహించడం సరికాదని, వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. మహాసభ నిర్వహించాలని, సమస్యలు పరిష్కరించాలని మరికొందరు సభ్యులు పట్టుబట్టారు. అనంతరం సభ కొనసాగింది. ఎల్లాయగూడెం, జల్లి గ్రామాల రైతులు గోదాం నిర్మాణాలకు స్థలం చూపిస్తామని వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. సభ్యత్వం ఉన్న రైతులకు కొత్త రుణాలు అందించాలని, చెన్నారావుపేట సొసైటీ ఆవరణలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న గోదామును తొలగించి నూతన భవనం నిర్మించాలని, పాత సొసైటీ ఆవరణలో మొరం పోయించి సీసీ పనులు చేపట్టాలని, తదితర సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఎల్లాయగూడెంలో స్థలాలను పరిశీలించి గోదాములు నిర్మించే దిశగా చొరవ తీసుకుంటామని తెలిపారు. కొత్త సభ్యులకు సైతం రుణాలందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. పాత సొసైటీలో సీసీ పనులు చేపట్టే దిశగా ఎమ్మెల్యే సహకారం కోరతామని చెప్పారు. ఇదిలా ఉండగా జల్లి గ్రామంలో గోదాం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం అనువుగా లేకపోతే తను సొంతంగా ఆరు గుంటల భూమి ఇస్తానంటూ ఆ గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి కాగితంపై సభ్యుల ఎదుట సంతకం చేసి ప్రదర్శించారు. రైతులందరికీ రూ.లక్ష చొప్పున రుణం ఇవ్వాలని చెన్నారెడ్డి కోరారు. మహాసభలో సహకార శాఖ నోడల్ ఆఫీసర్ ఈగ వెంకటేశ్వర్లు, కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ యాకూబ్, సొసైటీ వైస్‌చైర్మన్ చింతకింది వంశీ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

'పోరాట' వారసత్వాన్ని కొనసాగించాలి

వర్ధన్నపేట : బూర్జువా పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఆరెల్లి రవి అధ్యక్షతన మండలంలోని ఇల్లందలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా ఆవిష్కరించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నది కమ్యూనిస్టులు, ప్రజలు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గన్నారపు రమేష్, పనాస ప్రసాద్, మియాపురం గోవర్ధన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చర్లతండాలో భానుచంద్ స్తూపానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, బాషుమియా నివాళులర్పించారు. అనంతరం రోళ్లకల్‌లో బైరు శాంతమ్మ స్తూపానికి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు అమరులను స్మరిస్తూ కళారూపాన్ని ప్రదర్శించారు. టుక్యానాయక్‌తండాలో టుక్యానాయక్ స్తూపం వద్ద రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ జెండా ఎగరేశారు. కార్యక్రమంలో పార్టీ నెక్కొండ మండల కార్యదర్శి చెన్నకేశవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని జల్లికి చెందిన చీకటి వీరస్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన గణపతి యూత్ సభ్యులు శుక్రవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత వీరస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గణపతి యూత్ అధ్యక్షుడు ఇండ్ల సునిల్, ఉపాధ్యక్షుడు తండా రమేశ్, కోశాధికారి చిన్న రాజు, సభ్యులు సతీశ్, వీరన్న, సందీప్‌రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.